క్లుప్తంగా

ఆర్టీసీ స్టీల్‌సిటీ డిపో సిబ్బంది నిజాయితీ



ల్యాప్‌టాప్‌ను అప్పగిస్తున్న డిపో అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్, కానిస్టేబుల్ శంకర్

ఉక్కునగరం: ఆర్టీసీ కూర్మన్నపాలెం స్టీల్‌సిటీ డిపో సిబ్బంది బస్సులో దొరికిన ల్యాప్‌టాప్‌ను పోగొట్టుకున్న వ్యక్తికి అందజేసి తమ నిజాయితీ చాటుకున్నారు. అనకాపల్లికు చెందిన సీహెచ్. సత్యసాయి సంపత్ ఈనెల 6న కూర్మన్నపాలెం వచ్చి 111వీ బస్సు ఎక్కాడు. మధురవాడలో బస్సుదిగిన సంపత్ రూ.70 వేల విలువైన ల్యాప్‌టాప్‌లో బస్సులో మర్చిపోయాడు. ఆ రోజు విధుల్లో ఉన్న కండక్టర్ ఆర్.వి.లక్ష్మి, డ్రైవర్ ఎం. అర్జున్ సాయంత్రం ల్యాప్‌టాప్‌ను డిపోలో అప్పగించారు. ల్యాప్‌టాప్ పోగొట్టుకున్న సంపత్ డిపోకు రావడంతో ఆధారాలు పరిశీలించి డిపో అసిస్టెంట్ మేనేజర్ పి. శ్రీనివాస్, ఆర్టీసీ కానిస్టేబుల్ శంకర్ ల్యాప్‌టాప్‌ను అందజేశారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కూర్మన్నపాలెం: కణితి రామాలయంలో శుక్రవారం నిర్వహించిన నేత్ర వైద్యశిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డగోవింద్,ప్రగడ శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం వాసన్ ఐ కేర్ ఆస్పత్రి వైద్యులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి కంటి పరీక్షలు నిర్వహించారు. పలువురిని శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేశారు. మరి కొందరికి కళ్లద్దాలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డ సన్యాసిరావు, ప్రగడ శంకర్రావు, దుగ్గప్ప దానప్పలు, కొన్న నారాయణ, పూడి శ్రీను, గున్న రామారావు, ప్రగడ అప్పలనాయుడు, బొడ్డ తాతారావు, కోటి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



ప్రభుత్వ స్థలంలో నిర్మించిన షెడ్లను తొలగిస్తున్న పొక్లెయిన్

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు జగ్గరాజుపేటలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన రేకుల షెడ్లను గాజువాక తహసీల్దార్, జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. గ్రామ సర్వే నంబర్ 96 భాగం 3లో 1.64 ఎకరాల విస్తీర్ణం ప్రభుత్వ గయాలుగా రికార్డులో ఉందని, వీటిలో 350 చదరపు గజాల స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన ఐదు రేకుల షెడ్లను హైకోర్టు ఉత్తర్వుల మేరకు నోటీసులు జారీ చేసి తొలగించినట్టు అధికారులు తెలిపారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ), ఏపీ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎన్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్లంబర్ కోర్సులో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు ఉండి పదో తరగతి పాసైన వారు అర్హులన్నారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని శిక్షణ సంస్థలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 9133242666 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

స్ఫూర్తిప్రదాత వివేకానందుడు

అగనంపూడి: యూత్ ఐకాన్ స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని నగరంలో నిర్వహించిన శోభాయాత్రలో దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల నుంచి ప్రారంభించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ స్వామి వివేకానందను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.సన్యాసిరావు పాల్గొన్నారు.

ప్రణీత్ నాదం

టాలెంట్...
కాదు.. కాదు
మల్టీ టాలెంట్..

అవును మీరు చదువుతున్నది నిజమే.. పదకొండేళ్ల బాలుడు ఒకటి కాదు రెండు కాదు భిన్న విద్యల్లో రాణిస్తున్నాడు. అవార్డులు, పురస్కారాలు అందుకుంటున్నాడు. అయినా ఆ బాలుడి అసలు లక్ష్యం వేరు..! ఎన్ని విద్యల్లో రాణించినా.. ఎన్ని పురస్కారాలు అందుకున్నా.. భవిష్యత్తులో కలెక్టర్ కావాలన్నదే తన లక్ష్యమని చెబుతున్నాడు గాజువాకకు చెందిన కలివరపు ప్రణీత్‌కుమార్.



అన్నమయ్య కీర్తనల ఆలాపనలో అభినందనోత్సవం



కీ బోర్డు ప్లే చేస్తున్న ప్రణీత్ కుమార్

గాజువాక: ఆ బాలుడి వయసు పదకొండేళ్లు. ఆరో తరగతి చదువుతున్నాడు. ఒక పక్క చదువుకొంటూనే మరోపక్క సంగీత సాధనలో దూసుకుపోతున్నాడు. కీబోర్డు వాయిస్తాడు. పాటలు పాడుతాడు. డోలక్కు కొడతాడు. వీటితోపాటు చిత్రలేఖనంలోనూ ప్రతిభ చాటుతాడు. ఇవి ఎక్కడో నేర్చుకొని తన ప్రతిభా పాటవాలను చాటుతున్నాడనుకుంటే పొరపాటే...!

తండ్రిని అనుకరిస్తూ..

భజన కోసం తండ్రి చేస్తున్న సాధనను గమనిస్తూ అతడే సొంతంగా నేర్చుకొంటున్న విద్యలివి. తన సాధనతో కీబోర్డు వాయిద్యంలో ఏకంగా నంది అవార్డు సొంతం చేసుకున్నాడు. బహుముఖ ప్రతిభ ప్రదర్శిస్తున్న కలివరపు ప్రణీత్ కుమార్ గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆరో తరగతి చదవుతున్నాడు. ఇన్ని నైపుణ్యాలు ఉన్నా బాగా చదువుకొని భవిష్యత్‌లో కలెక్టర్ కావాలన్నది తన లక్ష్యమని చెబుతున్నాడు.

ఇదీ కుటుంబ నేపథ్యం

ప్రణీత్ కుమార్ తండ్రి మల్లికార్జునరావు. శ్రీకాకుళం జిల్లా నుంచి ఇక్కడికి వలస వచ్చిన ఆయన దుర్గా మల్లేశ్వర భజన మండలి ఏర్పాటు చేసుకొని దేవాలయాల్లో ప్రదర్శనలు ఇస్తుంటారు. భజన పోటీల్లో పాల్గొనడం కోసం, వివిధ ఆలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాల కోసం ఇంట్లోనే పాటలు సాధన చేస్తుంటారు. తండ్రి చేస్తున్న సాధనను నిశితంగా గమనించిన ప్రణీత్ కుమార్ సొంతంగానే కీబోర్డు నేర్చుకున్నాడు. డోలక్కు వాయించడంలో నైపుణ్యం సాధించాడు. వివిధ పాటలు పాడుతూ అందర్నీ అలరిస్తుంటాడు. ఈ సాధనలో తనకు గురువంటూ ఎవరూ లేకపోవం విశేషం. అతడి పట్టుదలను గమనించిన తండ్రి కొడుకు సాధన చేస్తున్న సమయంలో దొర్లే పొరపాట్లను సరి చేస్తూ ముందుకు నడిపిస్తున్నారు.

ఏడాదికి 200 ప్రదర్శనలు

ప్రణీత్ కుమార్ వివిధ ఆలయాలు, కార్యక్రమాల్లో ఏడాదికి సుమారు 200 ప్రదర్శనలు ఇస్తారు. కీబోర్డు, డోలక్కుతోపాటు పాటలు కూడా పాడి ఆహుతులను ఓలలాడిస్తుంటాడు. ఎక్కువగా ఆధ్యాత్మిక గీతాలను ఆలపిస్తుంటాడు. సందర్భానుసారంగా ఇతర గీతాలను కూడా పాడి వినిపిస్తాడు. అమ్మ పాటలు బాగా పాడతాడు. వీటితో పాటు పాఠశాలల్లో నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో వివిధ పాటలను ఆలపించి అభినందనలు అందుకుంటాడు. గతేడాది కాశీలోని ఇస్కాన్ ఆలయంలో మృదంగం వాయించి ప్రముఖుల నుంచి అభినందనలు అందుకున్నాడు. సింహాచలం దేవస్థానంలో కీబోర్డు ప్లేయర్‌గా, గాయకుడిగా ఇప్పటివరకు 50 కచేరీలు చేశాడు.



ప్రణీత్ కుమార్‌కు నంది అవార్డు అందజేస్తున్న తెలుగు వెలుగు సాహితీ వేదిక ప్రతినిధులు

11 ఏళ్లకే నంది అవార్డు సొంతం

సంగీతంతో పాటు ఆధ్యాత్మిక గీతాలాపనలో దిట్ట

తండ్రిని అనుకరిస్తూ సంగీతం, కీ బోర్డు వాయిద్యంపై పట్టు

చిత్రలేఖనంలోనూ అందెవేసిన చెయ్యి

గాజువాకకు చెందిన ప్రణీత్ ప్రతిభ

కలెక్టర్ కావాలన్నదే తన లక్ష్యమని అని వెల్లడి

అభినందనలు, సత్కారాలు



ప్రణీత్ కుమార్ కీబోర్డు ప్లేయర్‌గా, గాయకుడిగా మంచి పేరు తెచ్చుకున్నాడు. చిత్రలేఖనంలో నైపుణ్యం సాధించాడు. వివిధ వేదికలపై ప్రదర్శనలు ఇచ్చి అనేకమంది ప్రముఖులనుంచి సత్కారాలు, అభినందనలు అందుకున్నాడు.

- కీబోర్డు ప్లే, గానం, చిత్రకళారంగంలో నైపుణ్యం ప్రదర్శిస్తున్నందుకుగాను తెలుగు వెలుగు సాహితీ వేదిక నంది అవార్డు ప్రదానం చేసింది. విజయవాడలో నిర్వహించిన స్వామి వివేకానంద జయంత్యుత్సవాలు–2025లో ఈ అవార్డు ప్రదానం చేశారు.
- గతేడాది అన్నమయ్య కీర్తనలను అద్భుతంగా ఆలపించిన ప్రణీత్ కుమార్‌ను తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన గాయకురాలు కొండవీటి జ్యోతిర్మయి సత్కరించారు.
- గాజువాకలో నిర్వహించిన ఉత్తరాంధ్ర భజన యజ్ఞం పోటీల్లో శివుడే దేవుడు, వేపచెట్టుకు ఉయ్యాల పాట వంటి పాటలు పాడి ద్వితీయ బహుమతి సాధించాడు. బహుముఖ ప్రజ్ఞావంతుడు బ్రహ్మశ్రీ భాస్కరభట్ల సత్య ప్రసాద్ శర్మ చేతులమీదుగా అభినందన పూర్వక సత్కారం అందుకున్నాడు. – కళాభారతిలో నిర్వహించిన చిన్న పిల్లల కీర్తనల కచేరిలో పాల్గొన్న ప్రణీత్ కుమార్ కీబోర్డు ప్లేతో అందర్నీ ఆకట్టుకున్నాడు. ఆ కార్యక్రమంలో ప్రతిభా అవార్డుతో సత్కరించారు.
- గతేడాది మాతృభాషా దినోత్సవం సందర్భంగా విశాఖలో నిర్వహించిన కార్యక్రమంలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అన్ని ఈవెంట్లకు ప్రణీత్ కుమార్ నిరంతరాయంగా కీబోర్డు ప్లే చేశాడు. ఇందుకుగాను జిల్లా కలెక్టర్, డీఈవోల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందుకున్నాడు.
- ఆలిండియా రేడియో విశాఖపట్నం కేంద్రంలో నిర్వహించిన బాలల కార్యక్రమంలో ప్రణీత్ ప్లే చేసిన కీబోర్డు ప్రదర్శనకు ప్రముఖుల నుంచి అభినందనలు లభించాయి.
- బీహెచ్‌పీవీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో 2023లో పాడిన పాటలకు అప్పటి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేతులమీదుగా నిర్వాహకులు సత్కరించారు.

త్రిశక్తి ఆలయంలో కల్యాణ మాతంగి పూజలు



అక్షరాభ్యాసాల్లో పాల్గొన్న బాలబాలికలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని త్రిశక్తి దేవాలయంలో శుక్రవారం రాజశ్యామల పూజలు చేశారు. ఆలయంలో జరుగుతున్న శ్యామలా (గుప్త) నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు సర్వజన వశీకరణ, భూసంబంధ కార్యాల కోసం అమ్మవార్లకు ఈ పూజలు చేశారు. అంతకు ముందు వేకువజామున ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో మహాదుర్గ, మహాసరస్వతి, మహాదుర్గ అమ్మవార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం బాలలకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున తల్లిదండ్రులు, బాలబాలికలు పాల్గొన్నారు. సాయంత్రం ఆలయ ఆవరణలో రుత్వికుల ఆధ్వర్యంలో రాజశ్యామల హోమం జరిగింది. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా ఆలయ పునర్నిర్మాణ స్థిర ప్రతిష్ట



ఆలయ పునర్నిర్మాణ స్థిర ప్రతిష్టమహోత్సవంలో పాల్గొన్న దేవన్‌రెడ్డి

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు మంగళపాలెంలోని స్వయంభు శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయ పునర్నిర్మాణ స్థిర ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి పాల్గొని విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో 88వ వార్డు అధ్యక్షుడు దాడి నూకరాజు, వైఎస్సార్‌సీపీ గాజువాక అధ్యక్షుడు బొడ్డ గోవింద్, మడక నరసింగరావు, ఆలయ పునర్నిర్మాణ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యాయమూర్తి రాజేంద్రబాబుకు ఘన సత్కారం



న్యాయమూర్తి రాజేంద్రబాబుకు జ్ఞాపిక అందజేస్తున్న న్యాయవాదులు

గాజువాక: కర్నూలు పోక్సో కోర్టు అదనపు జిల్లా జడ్జిగా పదోన్నతిపై వెళ్తున్న గాజువాక ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి రాజేంద్రబాబును స్థానిక న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. గాజువాక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో న్యాయమూర్తిని సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో అనకాపల్లి 10వ అదనపు జిల్లా జడ్జి శ్రీవిద్య, 8వ అదనపు జిల్లా జడ్జి కవిత, 3వ ఏసీజేఎం పల్లవి, గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.ప్రభాకరరావు, పి.పుల్లయ్యనాయుడు, కార్యవర్గ సభ్యులు టి.శ్రీనివాస్, గిల్బర్ట్, కిషన్ బాబు, ఎస్‌బీసీహెచ్ లక్ష్మి, అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా ప్రసన్న గిరి ప్రదక్షిణ



రథంలో వేంకటేశ్వరుడిని ప్రతిష్ఠించి గిరిప్రదక్షిణ నిర్వహిస్తున్న దృశ్యం



గిరి ప్రదక్షిణలో కలశాలతో భక్తులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ సిగ్నల్ పాయింట్ ఎదురుగా గల ప్రసన్న వేంకటేశ్వరాలయం వార్షికోత్సవం సందర్భంగా ప్రసన్నగిరి చుట్టూ శుక్రవారం గిరి ప్రదక్షిణ నిర్వహించారు. 108 కలశాలతో కోలాటం నడుమ శ్రీదేవి, భూదేవి సహిత ప్రసన్న వేంకటేశ్వరుడి ఉత్సవ విగ్రహాలను రథంలో ప్రతిష్ఠించి భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు.

నేడు ప్రత్యే పూజలు

దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం భీష్మ ఏకాదశి పురస్కరించుకుని శ్రీవేంకటేశ్వర, వినాయక స్వామి ఆలయంలోఅభిషేకం, సహస్ర దుర్వార్చన, కొండపై వేంచేసియున్న దాసాంజనేయ స్వామి ఆలయంలో క్షీరాభిషేకం, అప్పాలు, ఆకుపూజ నిర్వహించనున్నారు. ప్రసన్న వేంకటేశ్వరాలయంలో సహస్ర తులసి అర్చన, పద్మావతి ఆండాళ్ సమేత శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి తెలిపారు.

1457వ రోజుకు చేరుకున్న ఉక్కు ఆందోళన



దీక్షా శిబిరంలో పాల్గొన్న నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు ఉద్యోగులు చేపట్టిన ఆందోళన శుక్రవారం నాటికి 1457వ రోజుకు చేరుకుంది. శిబిరాన్ని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డి. ఆదినారాయణ,వరసాల శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్మాగారంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నాయని ఆరోపించారు. పోరాటాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దీక్షలో వివిధ కార్మిక సంఘాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీవారికి పుష్పయాగం



పుష్పయాగంలో శ్రీనివాసుడు

పెదగంట్యాడ: వినాయకనగర్ వుడా కాలనీలో వేంచేసియున్న పద్మావతి ఆండాళ్ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామికి శుక్రవారం పుష్పయాగం నిర్వహించారు. ఆలయ 20వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ రకాల పుష్పాలతో పూజలు చేశారు. మాతృశ్రీ సాయి డ్యాన్స్ అకాడమీ టీచర్ రమ్య ఆధ్వర్యంలో ప్రదర్శించిన శ్రీనివాస కల్యాణం నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



విండ్ బాల్ క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కరణంరెడ్డి నరసింగరావు

పెదగంట్యాడ: మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. మాఘపౌర్ణమిని పురస్కరించుకుని గంగవరంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి విండ్ బాల్ క్రికెట్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పేర్ల అప్పారావు, సీహెచ్ రాజు, పోలరాజు, శ్రీను, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్‌ను రద్దు చేస్తే కార్మికులను పర్మినెంట్ చేయాలి



మాట్లాడుతున్న గొలగాని అప్పారావు

గాజువాక: పారుగు సేవల కార్మికుల కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆప్కాస్‌ను రద్దు చేస్తే కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు డిమాండ్ చేశారు. ఈ అంశంపై పారిశుధ్య కార్మికుల మస్టర్ పాయింట్ల వద్ద శుక్రవారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కాస్‌ను రద్దు చేయాలని గురువారం మంత్రి వర్గం తీర్మానించినట్టు పత్రికల్లో వచ్చిందన్నారు. ఈ ప్రకటనతో ఆప్కాస్‌లో అవుట్‌సోర్సింగ్ కార్మికులందరూ ఆందోళన చెందుతున్నారన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తే తిరిగి దళారీ వ్యవస్థ రంగంలోకి వస్తుందని, ఉద్యోగాలకు భద్రత లేకుండా పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఆప్కాస్ ఏర్పాటు కాకముందు మున్సిపాల్టీల్లోని ప్రతి సెక్షన్‌లో దళారీ వ్యవస్థ కొనసాగేదని, జీత భత్యాల చెల్లింపులు దళారీల దయా దాక్షిణ్యాలపై ఉండేవని అన్నారు. ప్రతినెలా జీతాలు చెల్లించే వారు కాదని, ఐదారు నెలలపాటు జీతాలను పెండింగ్‌లో పెట్టేవారని పేర్కొన్నారు. ఆప్కాస్ వ్యవస్థ ఏర్పాటు వల్ల వీటన్నింటికీ కాలం చెల్లిందన్నారు. ఇప్పటికైనా ఇలాంటి ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెట్టి కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉక్కు ఉద్యోగికి గాయాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ లోపల బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఉద్యోగి తీవ్రంగా గాయపడ్డాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ సింటర్ ప్లాంట్ విభాగంలో మాస్టర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న బి. వెంకట కుమార్ టౌన్‌షిప్‌లోని సెక్టార్–2లో తన కుటుంబంతో నివసిస్తున్నారు. 2వ తేదీ రాత్రి షిఫ్టుకు విధులకు వెళ్తుండగా సీఆర్ఎంపీ బ్రిడ్జి వద్ద మలుపు తిరుగుతుండగా అదే సమయంలో ఎడమ వైపు వేగంగా వచ్చి ఒక బైక్ ఢీకొట్టింది.

ఈ సంఘటనలో వెంకట కుమార్ ఎడమ కాలు, ఎడమ కంటికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్స అనంతరం అతన్ని ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు స్టీల్‌ప్లాంట్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పైపులైనుకు లీకులు.. తాగునీటికి ఇబ్బందులు



పైపులైనుకు లీకులు ఏర్పడి వృథాగా పోతున్న తాగు నీరు

కూర్మన్నపాలెం: తాగునీరు అందించే పైపులైన్‌కు లీకులు ఏర్పడడంతో ఫకీర్‌తక్యాలో ప్రజలు అవస్థలు పడుతున్నారు. లీకులపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం దక్కడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 86వార్డు పరిధిలోని ఫకీర్‌తక్యాలో వందలాది కుటుంబాలు నివసిస్తున్నాయి. ఆ ప్రాంతంలో కుళాయిలకు నీరు చేరవేసే పైపులైను ఎక్కడికక్కడ రంధ్రాలు ఏర్పడడంతో మంచి నీరు వృథాగా పోతుంది. దీని వల్ల తగినంత నీరు అందక మహిళలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై వాటర్ సప్లై అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పైపులైనుకు మరమ్మతులు చేసి తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఫకీర్‌తక్యా ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

10న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్లు కిరణ్ కుమార్, సుధాకర్

గాజువాక: జాతీయ నులి పురుగుల నివారణ దినం పోస్టర్‌ను జీవీఎంసీ గాజువాక జోన్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది పిల్లల నుంచి 19 ఏళ్ల గల బాల బాలికలు నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోవాలన్నారు. 10వ తేదీన ఆల్బెండ జోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. గాజువాక పీహెచ్‌సీ సీహెచ్‌వో పి.నాగ అప్పారావు, వైద్యాధికారి డాక్టర్ ఎం.సుధాకర్, పెదగంట్యాడ, కణితి, తుంగ్లాం పీహెచ్‌సీ ఆరోగ్యాధికారులు టి.వి.వి.సత్యనారాయణ, గోపీ, కుమల కుమారి తదితరులు పాల్గొన్నారు.